ఎట్టకేలకు కొనుగోళ్లు ప్రారంభం



శేర్కాన్‌పల్లిలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న అధికారులు

హత్నూర, మే 22: మండలంలోని శేర్కాన్‌పల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో ఎట్టకేలకు బుధవారం ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన '40రోజులైనా కొనుగోళ్లేవి' అనే కథనానికి స్పందించిన సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్లు సుజాతచౌహాన్, షాజీయొద్దీన్ కేంద్రాన్ని పరిశీలించి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేర్కాన్‌పల్లి కొనుగోలు కేంద్రంలో లేబర్ కొరతతో కొనుగోళ్లలో జాప్యం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రానికి సుమారు 4 వేల బస్తాల ధాన్యం వచ్చిందని 600 బ్యాగుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రెండుమూడు రోజుల్లో మిగతా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. సిబ్బంది పోముసింగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూమిపై ప్రతిప్రాణి విలువైనదే..

సంగారెడ్డి కలెక్టరేట్: తారా కళాశాల నుంచి ర్యాలీ తీస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పటాన్‌చెరు, మే 22: బయోడైవర్సిటీ అంటేనే పంచభూతాలు అని, వాటిని కాపాడుకోవడమే మానవుడి బాధ్యత అని పలువురు వక్తలు అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని ఏపీజే అబ్దుల్ కలాం డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ విద్యార్థులకు జీవవైవిధ్యంపై చిత్రకళ, వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో పటాన్‌చెరు ఎంపీడీవో యాదగిరి హాజరై మాట్లాడారు. పెరుగుతున్న జనాభా, ఆధునిక సాంకేతికత జంతుజాలం, పర్యావరణానికి శాపంలా మారిందన్నారు. మండలంలో జీవవైవిధ్యం కాపాడేందుకు ఎంపీపీ ఆధ్వర్యంలో కమిటీ ఉన్నదన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ భూమిపై ఉన్న ప్రతి ప్రాణి విలువైనదని, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు జిల్లా కోఆర్డినేటర్ రఘునందన్, జువాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ రాధిక, పంచాయితీ కార్యదర్శులు రిజ్వాన్, పద్మావతి, పద్మ, షాజహాన్, అనిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడాలి

సిద్దిపేట టౌన్, మే 22: జీవవైవిధ్య సంరక్షణ అందరి బాధ్యత అని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు.అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కళాశాలలో 'జీవవైవిధ్య సంరక్షణ,ప్రణాళికలో భాగస్వాములమవుదాం'అనే అంశపై అవగాహన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జీవవైవిధ్య ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.సీడ్స్ బాల్స్ తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా పర్యావరణ కార్యకర్త జ్ఞానేశ్వర్ అవగాహన కల్పించారు.అంతకు ముందు పెయింటింగ్,వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో అధ్యాపకులు అయోధ్య రెడ్డి,మధుసూదన్‌రెడ్డి,విశ్వనాథం, మధుసూదన్,సునీత పాల్గొన్నారు.

ఘనంగా జీవ వైవిధ్య దినోత్సవం

సంగారెడ్డి కలెక్టరేట్, మే 22: జీవ వైవిధ్యంతోనే మానవ మనుగడ సాధ్యమని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, అర్థశాస్త్ర విభాగం, ఎకో క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవుని చర్యలతో భూమిపై పక్షి, వృక్ష జాతులు అంతరించిపోయే ప్రమాదం ఉన్నదన్నారు. ప్రతి ఒక్కరూ జీవవైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉన్నదన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీశ్వర్, ఎకో క్లబ్ కన్వీనర్ సుగుణావతి పాల్గొన్నారు.

బామనకుంటలో అక్రమ తవ్వకాలు

బామనకుంటలో మట్టి తవ్వకాలు

జిన్నారం, మే 22: గడ్డపోతారం పంచాయతీ అల్లీనగర్ పరిధిలోని బామనకుంటలో పట్టపగలే అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. సర్వేనంబర్ 27లో పరిశ్రమలకు కేటాయించిన స్థలంలోకి బామనకుంట నుంచి మట్టిని తరలిస్తున్నారు. బుధవారం పలువురు గ్రామస్తులు మట్టి తవ్వకాలను అడ్డుకున్నప్పటికీ ఇటాచీలతో దౌర్జన్యంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవన్నారు. తాతల నాటి మా భూములకు నష్టపరిహారం ఇవ్వకుండానే అధికారులు పరిశ్రమలకు కేటాయించారని పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్‌ను కలుస్తామని మాజీ ఉపసర్పంచ్ మమతాపెంటేశ్ తెలిపారు. గతంలో కూడా బామనకుంట శిఖంలో నిర్మాణాలు చేపడితే గ్రామస్తులు అడ్డుకొని అధికారులకు ఫిర్యాదు చేశారు. పనులు తాత్కాలికంగా నిలిపివేసినా మళ్లీ పనులు చేపట్టారు. తాజాగా బామనకుంటలోంచి మట్టిని తవ్వి తరలిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

సంగమేశ్వరాలయ హుండీ లెక్కింపు

కేతకీ హుండీ లెక్కింపులో భక్తులు, అర్చక సిబ్బంది

ఝరాసంగం, మే 22: ఝరాసంగం మండల కేంద్రంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో బుధవారం దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ ఓకోటి రంగరావు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారు. 67 రోజులకు రూ. 26 లక్షల 53 వేల 240 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి శశిధర్ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు హుండీలో వివిధ రూపాల్లో వేసిన కానుకల లెక్కింపు కార్యక్రమం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగింది. కామారెడ్డి పట్టణానికి చెందిన రాజరాజేశ్వరి సేవా సమితి భక్తులు, అర్చక సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు రమేశ్, వీరన్న, శివకుమార్ పాల్గొన్నారు. ఎస్ఐ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అ 'పూర్వ'సమ్మేళనం

రాయపోల్, మే 22: మండలంలో దొమ్మట జడ్పీహెచ్ఎస్‌కు చెందిన టెన్త్ 2005-2006 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాన్ని బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బండి జోసెఫ్, గురునాక్,కరుణాకర్, ఖాదర్, ప్రవీణ్, స్టీవే న్, మమత, హరిత,సునీత, సంగీత, ప్రవీణ్‌తోపాటు 45 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు శాపంగా కాంగ్రెస్ పాలన

- దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలి
- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



బీబీపేట్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, మే 22: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు శాపంగా మారిందని, యాసంగిలో రైతులు పండించిన జొన్నలను కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని హెచ్చరించడంతో హుటాహుటిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బీబీపేట్‌లోని జొన్నల కొనుగోలు కేంద్రంలో కొనుగోలు తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ధాన్యానికి రూ.500లు బోనస్ ఇస్తామని చెప్పిందని, ఇప్పుడు సన్న ధాన్యానికే బోనస్ ఇస్తామని చెప్పడం అంటే రైతులను మోసం చేయడమే నన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులను రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలన్నారు. ప్రతి విషయానికి రాజకీయ రంగు పులిమి ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో రైతుల ధాన్యా న్ని కొనుగోలు చేసి నిల్వ చేసేందుకు గోదాంలను నిర్మించినట్లు తెలిపారు. ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు చేతగాని తనంతో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే సేకరించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసేంతవరకు రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు అలీ, మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, కల్హేర్ పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు బాలయ్య, యాకూబ్, జనార్ధన్‌సార్, సాయిగొండ, పోచబోయిన బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముందు అభివృద్ధిపై దృష్టి సారించాలి

కల్హేర్, మే 22: కాంగ్రెస్ నాయకులకు అభివృద్ధి చేపట్టడం చేతగాక బీఆర్ఎస్ నాయకులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బైండ్ల పోచయ్యపై కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడి చికిత్స పొంది ఇంటికి రావడంతో మాజీ ఎమ్మెల్యే వెళ్లి పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిపై దృష్టి సారించాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. దాడులకు పాల్పడడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు.

ప్రతి కార్యకర్తకూ భరోసా

నారాయణఖేడ్, మే 22: ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ భరోసా కల్పిస్తుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. కంగ్టి మండలం గాజులపాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సలీం ప్రమాదవశాత్తు మృతి చెందగా పార్టీ సభ్యత్వ బీమా ద్వారా రూ.2 లక్షల చెక్కును అతడి తండ్రి శంశోద్దీన్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేశ్, నాయకులు రవీందర్‌నాయక్, ఎం.ఏ.నజీబ్, ముజామ్మిల్, ఎం.ఏ. బాసిత్, సంతోశ్‌పాటిల్ పాల్గొన్నారు.

ప్రతి గింజనూ కొనాలి

చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం భూపాల్‌రెడ్డి నారాయణఖేడ్ మండలం ర్యాకల్ గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు చేసిన జొన్నల 24 గంటల్లో డబ్బులు అందజేయాలన్నారు.

ఈత రాక విద్యార్థి మృతి

శివకుమార్(ఫైల్)

జిన్నారం, మే 22: చెరువులో స్నానం చేసేందుకు వెళ్లిన విద్యార్థి ఈత రాక నీటిలో మునిగి మృతి చెందిన ఘటన వావిలాలలో జరిగింది. జిన్నారం ఎస్ఐ విజయకుమార్, విద్యార్థి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మనూర్ మండలం పుల్కుర్తి గ్రామానికి చెందిన అవుసలి శివకుమార్(20) డిగ్రీ చదువుతున్నాడు. ఈనెల 20న మెదక్‌లో తన స్నేహితుడి అన్న వివాహానికి హాజరయ్యేందుకు స్నేహితులు అక్షయ్, కార్తీక్, గౌతమ్, కరణ్‌సింగ్, యశ్వంత్‌లతో కలిసి వెళ్లాడు. అనంతరం ఇంటికి తిరిగి వస్తుండగా తన స్నేహితుడి అమ్మమ్మ గారి ఊరు లక్ష్మీపతిగూడెంలో రాత్రి బస చేశారు. 21వ తేదీ మధ్యాహ్నం వావిలాల శివారులోని ఫీర్సా చెరువులో స్నానాలు చేసేందుకు స్నేహితులతో కలిసి శివకుమార్ దిగాడు. ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు కాలు జారి జేసీబీ గుంతలో పడిపోయాడు. శివకుమార్ ఇంటికి స్నేహితులు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పడంతో తల్లి పుణ్యవతి, తండ్రి గణపతి బంధువులతో కలిసి పీర్సా చెరువుకు చేరుకున్నారు. బుధవారం ఉదయం శివకుమార్ మృతదేహం తేలడంతో తండ్రి గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి..

వర్గల్, మే 22: చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు మృత్యువాత పడిన ఘటన వర్గల్ మండలం నెంటూర్‌లో చోటుచేసుకుంది. బేగంపేట ఎస్సై భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పూడూరి స్వామి మంగళవారం రాత్రి సామలచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. స్వామి అప్పటికే మద్యం తాగి ఉండటంతో నీటిలోనే మునిగిపోయాడు. స్వామి చెరువులోపడి మృతిచెందాడన్న విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ రంగారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కొండల్‌గౌడ్, గ్రామస్తులు పెద్దసంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గామస్తుల సమాచారం మేరకు కేసునమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

గొర్రెలకు టీకాలు

గొర్రెలకు చిట్కరోగం నివారణ టీకా వేస్తున్న పశువైద్యధికారి హర్షవర్ధన్‌రెడ్డి

రాయికోడ్, మే 22: గొర్రెలకు చిట్కరోగం నివారణ టీకాలు వేస్తున్నామని మండల పశువైద్యధికారి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇందూర్‌లో గొర్రెలకు చిట్కరోగం టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో 11 వేల గొర్రెలు ఉనాయని, ఈ నెల 31 వరకు ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. గొర్ల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది అలీం, కృష్ణ ఉన్నారు.

మిత్రుడికి ఆర్థిక సహాయం

గుమ్మడిదల, మే 22: గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన బదనాపురం రమేశ్ కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న(2007-2008) పదో తరగతి మిత్రులు తోటి మిత్రుడికి అండగా నిలిచి ఆర్థిక సహాయాన్ని అందించారు. కష్ట కాలంలో మిత్రుడికి భరోసాగా నిలిచారు. మిత్రుల సహాయానికి రమేశ్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

పకడ్బందీగా ఓట్లు లెక్కించాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి



కౌంటింగ్ నిర్వహించే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 22: ఎంపీ ఎన్నికల్లో భాగంగా జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. బుధవారం స్థానిక పీఎస్ఆర్ గార్డెన్‌లో కౌంటింగ్ సూపర్‌వైజర్లకు, సహాయకులకు ఓట్ల లెక్కింపుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 153 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 173 మంది సహాయకులు, మొత్తం 326 మందికి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్‌లో మొత్తం 14 టేబుల్స్ ఉంటాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, కామారెడ్డి అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు రాజు, పాండు, అశోక్ చక్రవర్తి, మాస్టర్ ట్రైనర్ కృష్ణకుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలకు పడిగాపులు

- రైతులకు సరిపోను రాని విత్తన బ్యాగులు
- డిమాండ్‌కు తగ్గ సప్లై చేయాలంటున్న అన్నదాతలు

దౌల్తాబాద్‌లో జనుము విత్తనాలు విక్రయిస్తున్న వ్యవసాయాధికారులు(ఫైల్)

హత్నూర, మే 22: వానకాలం సీజన్‌కు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ముందస్తుగా దుక్కులు దున్నుకొని జీలుగు, జనుము విత్తనాలకోసం ఎదురుచూస్తున్నారు. పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే భూమిలో పోషకవిలువల కోసం రైతులు పంట సాగుకు ముందు పచ్చిరొట్ట విత్తనాలు సాగుచేస్తారు. అలా పొలంలో వేసిన విత్తనాలు మొలకెత్తి ఏపుగా పెరిగిన తర్వాత నాటుకు ముందు పొలంలోనే దున్ని మడుల్లోనే మురగబెడతారు. దీంతో భూమిలో పోషకవిలువలు పెరిగి అధిక దిగుబడి వస్తుంది. సకాలంలో విత్తతేనే వానకాలం సీజన్ వరకు ఏపుగా పెరిగి భూమికి బలం వస్తుందని విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే మండలంలో రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హత్నూర మండలంలో పీఏసీఎస్ కార్యాలయంతోపాటు, ఆగ్రోస్ రైతుసేవాకేంద్రం ద్వారా మండలంలోని రైతులకు విత్తనాలు విక్రయిస్తున్నారు. రైతులకు సరిపోను విత్తనాలు రావడం లేదు. విత్తన సంచులు వచ్చినవెంటనే అమ్ముడుపోతుండటంతో మిగతా రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలానికి 500 క్వింటాళ్ల జీలుగు, 80 క్వింటాళ్ల జనుము విత్తనాలు రావాల్సి ఉండగా కేవలం 170క్వింటాళ్ల జీలుగు, 50 క్వింటాళ్ల జనుము విత్తనాలు మాత్రమే వచ్చాయి. దీంతో ప్రభుత్వం రైతులకు సరిపోను విత్తనాలు సరఫరా చేయకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో విత్తనాలు వేస్తేనే ప్రయోజనం ఉంటుందని, రైతుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేయాలని కోరుతున్నారు.

27న ట్రైడెంట్ బకాయిల చెల్లింపు

ట్రైడెంట్ పరిశ్రమ ఎండీ, కార్మిక సంఘం నాయకులతో కలెక్టర్ వల్లూరు క్రాంతి

కలెక్టర్ వల్లూరి క్రాంతి సమక్షంలో కుదిరిన ఒప్పందం

కలెక్టరేట్, మే 22: జహీరాబాద్‌లోని ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ రైతులు, కార్మికుల బకాయిలను ఈనెల 27న చెల్లించనున్నది. ఈ మేరకు ట్రైడెంట్ యాజమాన్యం కార్మికులతో బుధవారం ఒప్పందం కుదుర్చుకున్నది. కలెక్టర్ వల్లూరు క్రాంతి సమక్షంలో ట్రైడెంట్ పరిశ్రమ ఎండీ రామనాథ్, కార్మిక సంఘం నాయకులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ట్రైడెంట్ యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి. కార్మికుల వేతన బకాయిలు, పీఎఫ్, గ్రాట్యుటీ, ఎల్ఐసీ బకాయిలు ఈనెల 27న చెల్లించేలా ట్రైడెంట్ పరిశ్రమ హామీ పత్రం ఇచ్చిందని కలెక్టర్ చెప్పారు. కార్మికులకు రావాల్సిన మూడు నెలల వేతన బకాయిలు చెల్లించేందుకు పరిశ్రమ యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు. అలాగే రైతులకు రావాల్సిన బకాయిలు, జీఎస్టీ, ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఇతర పన్నులను చెల్లించేందుకు పరిశ్రమ ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. జూలై 1లోగా అన్ని బకాయిలు చెల్లించి పరిశ్రమ తిరిగి ప్రారంభించేందుకు ట్రైడెంట్ యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు. సమావేశంలో కార్మికశాఖ కమిషనర్ రాజశేఖర్, ఉపకమిషనర్ రవీందర్‌రెడ్డి, కార్మిక సంఘం నాయకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

జయము జయము.. నారసింహ

నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం వేచిచూస్తున్న భక్తులు

వర్గల్, మే 22: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీలక్ష్మీ నారసింహస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూలమంత్ర హోమం, మహా పూర్ణాహుతి, అభిషేకం, యాగశాలలో హోమం, శతఘటాభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీమృగనారసింహుడి ఆవిర్భావం అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. గజ్వేల్‌కోర్టు జడ్జి బి.ప్రియాంక దేవతామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

సిమ్లాలో పర్యటిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, తదితరులు

సిమ్లాలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మే 22: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని సిమ్లాలో పర్యటిస్తున్నారు. పటాన్‌చెరు నుంచి బయలుదేరిన ఎమ్మెల్యే, పలువురు బీఆర్ఎస్ నాయకులు సిమ్లాలోని రాష్ట్రపతి వేసవి విడిది కేంద్రం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ భవనం, క్రీస్తు చర్చ్, సెయింట్ మైకేల్ క్యాథడ్రల్ చర్చ్‌లను సందర్శించారు. ఆయన వెంట అమీన్‌పూర్ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, మాజీ ఎంపీ పీ యాదగిరియాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండు, మాణిక్‌ప్రభు, రాజు, దశరథ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి ఉన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడపొద్దు

కోహీర్, మే 22: నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని జహీరాబాద్ పట్టణ సీఐ రవి హెచ్చరించారు. మంగళవారం రాత్రి జహీరాబాద్ పట్టణంతోపాటు పస్తాపూర్ జాతీయ రహదారిపై డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. నంబర్ ప్లేట్ లేని 28 వాహనాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. 130 మంది వాహనదారులకు రూ.39,105 జరిమానా విధించినట్లు తెలిపారు.

గెస్ట్ టీచర్లకు దరఖాస్తు చేసుకోవాలి

కోహీర్, మే 22: జహీరాబాద్ పట్టణ సమీపంలోని హోతి(కే) గ్రామ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో గెస్ట్ టీచర్లుగా విధులు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ తెలిపారు. కళాశాలలో గణితం, భౌతిక, రసాయన, వృక్ష, జంతు శాస్త్రంలో పాఠాలు బోధించేందుకు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులు జూన్ రెండో తేదీన ఉదయం 10 గంటల వరకు పూర్తి వివరాలతో గురుకుల పాఠశాలలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. పాఠశాల స్థాయిలో తెలుగు, సంస్కృతం, హిందీ, ఆంగ్లం, గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రంలో ఖాళీలు ఉన్నాయన్నారు. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయిన వాళ్లు సంవత్సరం వరకు ఇక్కడే విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

బొల్లారం, మే 22: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై పూర్తి ఆధారాలతో కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫిర్యాదు చేసినట్లు యువజన కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్ బుధవారం తెలిపారు. నిర్మాణాలపై ఆర్టీఐ చట్టం కింద మున్సిపల్ అధికారులను వివరాలు కోరగా స్పందించలేదని పేర్కొన్నారు. సర్వే నంబర్ 75లో ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విన్నవించినట్లు తెలిపారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

గుమ్మడిదల, మే 22: సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. గుమ్మడిదల మండలంలోని పీఏసీఎస్ కేంద్రంలో వానకాలం సీజన